## 16, 17 తేదీల్లో కాంటెంపరరీ ఇష్యూస్ ఇన్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్‌పై జాతీయ సెమినార్

రామగిరి, ఫిబ్రవరి 8 : తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల-చర్లపల్లి ఆధ్వర్యంలో ఈ నెల 16,17 తేదీల్లో డిపార్ట్‌మెంట్ అఫ్ కామర్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కాంటెంపరరీ ఇష్యూస్ ఇన్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్-హైదరాబాద్ ద్వారా కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. చర్లపల్లిలోని డిగ్రీ కళాశాలలో జరిగే కార్యక్రమానికి వివిధ జాతీయ, రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, ప్రముఖ సంస్థల నిర్వాహకులు హాజరుకానున్నారని, జిల్లాలోని వివిధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు.



హాలియాలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, పక్కన నియోజకవర్గ కో ఆర్డినేటర్ జాజుల సురేందర్, రాంచందర్‌నాయక్

## రైతు వ్యతిరేకి కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్, జాజుల సురేందర్
- చలో నల్లగొండ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపు

హాలియా, ఫిబ్రవరి 8 : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకి అని మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్‌కుమార్, జాజుల సురేందర్ అన్నారు. బహిరంగ సభ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్‌తో కలిసి హాలియాలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం కేఆర్ఎంబీ పరిధిలోకి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 13న నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం బీఆర్ఎస్ పార్టీ 14 ఏండ్లు పోరాటం చేసి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సాధించిందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా తొమ్మిదిన్నరేండ్లు సుపరిపాలన అందించారని తెలిపారు. మోసపూరిత వాగ్దానాలతో ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులను వంచించడంతోపాటు స్వార్థ ప్రయోజనాల కోసం సాగునీటి ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి తాకట్టు పెట్టడం బాధాకరం అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకునేందుకు ప్రయత్నించినా కేసీఆర్ ప్రభుత్వం ఇవ్వలేదని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి లొంగకుండా రాష్ట్ర రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం పని చేసిందని తెలిపారు.

రాష్ట్రంలోని ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకునేందుకు అంగీకరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం సంతకం చేయడం సిగ్గుచేటన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా కొనసాగుతున్నప్పటికీ ఆయన మినిట్స్ బుక్ చదువకుండా కేఆర్ఎంబీ సమావేశంలో సంతకం పెట్టి రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలపై దెబ్బకొట్టినట్లు ఆరోపించారు. ప్రాజెక్టులపై అధికారాన్ని కేఆర్ఎంబీకి కట్టబెట్టడాన్ని నిరసిస్తూ ఈ నెల 13న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని రైతులను కోరారు. అనంతరం బహిరంగ సభ పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, నిడమనూరు ఎంపీపీ బొల్లం జయమ్మ, ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, రవినాయక్, పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, పగిళ్ల సైదులు, నాయకులు పాల్గొన్నారు.



గంధంవారిగూడెంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ దాసరి హరిచందన

నీలగిరి, ఫిబ్రవరి 8 : రాబోయే ఐదు నెలలు అప్రమత్తంగా ఉంటూ తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరిచందన దాసరి సూచించారు. గురువారం పానగల్‌లోని మిషన్ భగీరథ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించి నీటి సరఫరా ప్రణాళిక గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా సురక్షిత తాగు నీటి సరఫరా చేయాలన్నారు. ఇంట్రా విలేజ్ లీకేజీలు అరికట్టాలని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఎల్‌డీఎఫ్ నిధులు నుంచి ఖర్చు చేయాలని చెప్పారు. తాగు నీటి సమస్యపై ఎవరు ఫోన్ చేసినా పరిష్కరించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, ఏఈలు తాగు నీటి ఎద్దడి లేకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు.

### ఎంజీయూను సందర్శించిన కలెక్టర్

ఎంజీ యూనివర్సిటీలో గురువారం జిల్లా కలెక్టర్ హరిచందన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డితో కలిసి వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. యూనివర్సిటీలో సౌకర్యాలను పరిశీలించి వివిధ స్థాయిలో ఉన్న పనులకు సంబంధించి సూచనలు చేశారు. ఇంజినీరింగ్ కళాశాల, క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియాన్ని కలెక్టర్ సందర్శించారు. అనంతరం పట్టణ శివారులోని ఎస్ఎల్‌బీసీ గంధంవారిగూడెంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం కోసం అధికారులతో కలిసి అమె స్థల పరిశీలన చేశారు. ఆమె వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ వంశీకృష్ణ, ఏఈ సంతోష్ రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, తాసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న దళితబంధు లబ్ధిదారులు

## దళిత బంధు గ్రౌండింగ్ చేపట్టాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున
- నల్లగొండలో లబ్ధిదారుల అర్ధనగ్న ప్రదర్శన

నీలగిరి, ఫిబ్రవరి 8 : దళిత బంధు విషయంలో ప్రభుత్వం మౌనం వీడి గ్రౌండింగ్ చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత బంధు పథకం ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో దళిత బంధు లబ్ధిదారులతో నల్లగొండ పెద్ద గడియారం సెంటర్‌లో గురువారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నల్లగొండ నియోజకవర్గంలో 1055, తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం మండలంలో 270 మందిని దళిత బంధు పథకం కింద ఎంపిక చేశారని తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు విడుదల చేసిన నిధులను ఫ్రీజింగ్ చేయడం సరికాదని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభల ద్వారా పారదర్శకంగా చేశారని, ప్రక్రియను వేగవంతంగా చేసి నిధులు విడుదల చేయాలని కోరారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలు ఎలా కొనసాగిస్తున్నారో అదే తరహాలో దళిత బంధు పథకాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బడుపుల శంకర్, అద్దంకి రవీందర్, గాదె నరసింహ, కట్టెల శివకుమార్, మామిడి రమేశ్, పోతెపాక నవీన్, పిచ్చయ్య, నాగయ్య, బొల్లు రవీందర్, బొల్లెద్దు నాగయ్య, సైదులు, కిన్నెర అంజి, యన్నమల్ల వెంకటేశం, మైనం నాగేంద్ర, గోలి రమేశ్, యాదయ్య పాల్గొన్నారు.

## ఎకో పార్కులో జింక మృతి

నందికొండ, ఫిబ్రవరి 8 : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని నల్లగొండ, హైదరాబాద్ వై జంక్షన్ వద్ద ఉన్న ఎకో పార్కులోని ఓ జింక గురువారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్కులోని జింక తిరుమలాయగట్టు సమీపంలో రోడ్డు వద్ద జింక మృతి చెంది ఉంది. స్థానికులు గమనించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. పర్యాటకుల కోసం ఇటీవల ఫారెస్టులో జింకలను వదిలారు. జింకల సంరక్షణకు రక్షణ లేకపోవడంతోనే జింకలు రోడ్డుపైకి రావడంతో ఎవరో చంపి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫారెస్ట్ రేంజర్ రాఘవేంద్రను వివరణ కోరగా.. ఇటీవల ఫారెస్ట్‌లో వదిలిన జింకల్లో ఒకటి రోడ్డుపైకి రావడంతో కుక్క లు చంపి ఉంటాయని అన్నారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతామన్నారు.



మృతి చెందిన జింక

# 'చలో నల్లగొండ'కు సన్నాహాలు



- క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారానికి బీఆర్ఎస్ సన్నద్ధం
- మండలాల వారీగా పార్టీ శ్రేణులతో సమీక్ష
- ప్రాజెక్టుల అప్పగింతతో జరిగే నష్టంపై ప్రజల్లోకి..
- ఈ నెల 13న సభకు తరలి వచ్చేలా చూడడమే లక్ష్యం
- బహిరంగ సభకు నేటి నుంచి ముమ్మర ఏర్పాట్లు

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ): కేఆర్ఎంబీకి కృష్ణానది ప్రాజెక్టులను అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ తలపెట్టిన చలో నల్లగొండ బహిరంగ సభకు విస్తృతంగా సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ తీరుతో కృష్ణానది పరీవాహక ప్రాంతానికి జరుగనున్న నష్టంపై ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా ఈ సభ ద్వారా ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని విషయాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయనున్నారు. తద్వారా రానున్న కాలంలో రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా పోరాటాలకు ప్రజలను సన్నద్ధం చేయడమే సభ ప్రధాన లక్ష్యం. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చేలా బీఆర్ఎస్ విస్తృత ప్రచారానికి రంగంలోకి దిగింది.

### నియోజకవర్గాల వారీగా సమావేశాలు

ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించనున్న బహిరంగ సభపై బీఆర్ఎస్ పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. ఇప్పటికే సభా స్థలం ఎంపిక పూర్తి కాగా అనుమతి కోసం పోలీస్ శాఖకు లేఖ అందజేసింది. నేటి నుంచి సభా స్థలంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లపై దృష్టి సారించనున్నారు. మరోవైపు సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టుల అప్పగింత వల్ల జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించడం ద్వారా వారిని స్వచ్ఛందంగా కదలివచ్చేలా చేయాలని భావిస్తున్నారు. అందుకే ముందు పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయి వరకు కదిలించేలా సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నారు. గురువారం ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు నియోజకవర్గాల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఇందులో కాంగ్రెస్ ప్రభుత్వ తీరు, ప్రాజెక్టులకు వాటిల్లనున్న ముప్పు, దీనిపై కేసీఆర్ ఆలోచన, బహిరంగ సభ లక్ష్యం తదితర అంశాలను పార్టీ శ్రేణులకు వివరించారు. సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా పార్టీ యావత్ రంగంలోకి దిగి చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం యాదగిరిగుట్ట, భువనగిరి, నకిరేకల్, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో సన్నాహక సమావేశాలు పూర్తి కాగా తుంగతుర్తిలో బుధవారమే జరిగింది. మిగతా అన్ని చోట్ల ఒకటిరెండు రోజుల్లో పూర్తి చేయనున్నారు. మరోవైపు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో బహిరంగ సభ ఏర్పాట్లపై కసరత్తు మొదలు పెట్టారు. ఇప్పటికే సభాస్థలాన్ని ఎంపిక చేశారు. అనుమతి కోసం కూడా పోలీసు వారికి పార్టీ పరంగా లేఖను అందజేశారు. శుక్రవారం పోలీసు శాఖ నుంచి అనుమతిపై ప్రకటన రానుందని భావిస్తున్నారు. ఆ తర్వాత చకచకా సభా వేదిక నిర్మాణం, గ్యాలరీల ఏర్పాటు, బారీకేడింగ్, పార్కింగ్ స్థలాలను సిద్ధం చేయడం వంటి పనులన్నీ వేగవంతం కానున్నాయి. ఈ నెల 13న మధ్యాహ్నం 3గంటలకు బహిరంగ సభ జరుగనుండగా పార్టీ అధినేత కేసీఆర్ రోడ్డు మార్గంలోనే నల్లగొండకు రానున్నట్లు తెలిసింది.

## చలో నల్లగొండకు తరలిరండి

- కృష్ణా జలాలపై ప్రశ్నించే గొంతుక అవుదాం
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



చలో నల్లగొండ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పక్కన బీఆర్ఎస్ నేతలు చెరుకు సుధాకర్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, గుత్తా అమిత్‌రెడ్డి

నకిరేకల్, ఫిబ్రవరి 8 : కేంద్రం పరిధి నుంచి శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కాపాడుకునేందుకు ఈ నెల 13న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కేసీఆర్ బహిరంగ సభకు తరలిరావాలని, కృష్ణానది జలాలపై ప్రశ్నించే గొంతుక అవుదామని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. నకిరేకల్‌లో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణను కాంగ్రెస్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడం ఎంతవరకు సమంజసమన్నారు. హామీలు నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కేఆర్ఎంబీకి కృష్ణానది ప్రాజెక్టుల అప్పగింతను నిరసిస్తూ బీఆర్ఎస్ తలపెట్టిన చలో నల్లగొండకు భారీ సంఖ్యలో జన సమీకరణ చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మండలాలు, గ్రామాల వారీగా సమీక్షలు నిర్వహించి పార్టీ నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాలన్నారు. గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ బాలరాజు యాదవ్ మాట్లాడుతూ ఢిల్లీ పార్టీలను బొందపెట్టిన చరిత్రలు ప్రాంతీయ పార్టీలకు చాలా ఉన్నాయని, వంద రోజుల్లో అమలు చేస్తామన్న 420 హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలే బొంద పెడుతారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి ఎంపీ స్థానాలను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని గులాబీ శ్రేణులను కోరారు. అనంతరం చలో నల్లగొండ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జడ్పీటీసీలు మాద ధనలక్ష్మి, తరాల బలరాం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుత్తా అమిత్ రెడ్డి, తక్కెళ్లపల్లి ప్రభాకర్ రావు, సిల్వేరు ప్రభాకర్, సందినేని వెంకటేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు సోమ యాదగిరి, చల్లా కృష్ణారెడ్డి, నడికుడి ఉమారాణి, నవీన్‌రావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

### బహిరంగ సభను విజయవంతం చేయాలి

నార్కట్‌పల్లి : నల్లగొండలో 13న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభను విజయవంతం చేసేందుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు గుత్తా అమిత్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

## బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 8 : కృష్ణా జలాల్లో తెలంగాణ రాష్ట్ర హక్కుల సాధనే లక్ష్యంగా ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించే బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, మిర్యాలగూడ నియోజకర్గ సమన్వయకర్త ఆదర్శ్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను కేఆర్ఎంబీకి అప్పగించడం వల్ల రాష్ట్రానికి జరిగే నష్టాలను ప్రజలకు వివరించడానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. సభకు నియోజకవర్గ నుంచి 15వేల మందికి పైగా తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం చలో నల్లగొండ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిట్టిబాబునాయక్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, నాయకులు గడగోజు ఏడుకొండలు, ఒగ్గు జానయ్య, బోగవెల్లి వెంకటరమణచౌదరి, భిక్షంగౌడ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆయకట్టులో అన్నదాత వరిగోస

## నీళ్లు లేక ఎండుతున్న పొలాలు

- యాసంగిలో బోర్లు, బావుల ద్వారా లక్ష ఎకరాల్లో వరి సాగు
- 15 వేల ఎకరాల పంట ఎండే పరిస్థితి
- పశువులకు మేతగా ఇప్పటికే 4 వేల ఎకరాలు
- తాగు నీటి పేరుతో ఖమ్మానికి నీటి తరలింపు
- సాగు నీరు అందించి పంటలను కాపాడాలని రైతుల వేడుకోలు

***నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో వరి పొలాలు ఎండిపోతున్నాయి. ప్రాజెక్టులో నీళ్లు లేకపోవడం, వర్షాలు సమృద్ధిగా కురవక పోవడంతో ఈ ఏడాది వానకాలం, యాసంగికి సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయలేదు.***

*- మిర్యాలగూడ, ఫిబ్రవరి 8*

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో 51 మేజర్ల ద్వారా ఎడమకాల్వ కింద వరి సాగు చేస్తారు. సాగర్ నుంచి నీటి విడుదల లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుగా బోరు బావులు, ఊట బావుల ద్వారా వరిసాగు చేశారు. ఈ యాసంగిలో సుమారు లక్ష ఎకరాల్లో వరి వేశారు. నాట్లు వేసే సమయానికి ఇప్పటికి భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో బోర్లు సరిగా పోయడం లేదు. వేసిన కొద్ది మొత్తం పొలం కూడా పారగా ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి పొట్ట దశలో ఉన్న పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు. కానీ ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు.



వేములపల్లి మండలం తిమ్మారెడ్డిగూడెంలో ఎండిపోయిన వరి పొలంలో మేస్తున్న గొర్రెలు

### తాగు నీటి పేరుతో విడుదల.. గేట్లు తెరిచి పొలాలకు..

నాగార్జునసాగర్ ఎడమకాల్వ ద్వారా ఖమ్మం జిల్లాలో తాగునీటి కొరత తీర్చేందుకు పాలేరు రిజర్వాయర్‌ను నింపాలని వారం రోజులుగా 4వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. నల్లగొండ జిల్లా పరిధిలోనే డ్యామ్ ఉన్నా జిల్లా మీదుగానే నీటిని ఎడమ కాల్వ ద్వారా ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ వదులుతున్నారు. పాలేరు రిజర్వాయర్ కింద రైతులు దర్జాగా గేట్లు తెరిచి పంట పొలాలకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైతులు మేజర్లకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేసినా పట్టించుకునే వారే లేరు. సోమవారం ఒక్క పూట మాత్రమే మేజర్లకు నీటిని వదిలి వెంటనే నిలిపి వేశారు. ప్రతి మేజర్ వద్ద పోలీసులు, ఎస్‌ఎస్పీ సిబ్బందిని కాపలాగా ఉంచి పాలేరు రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తున్నారు. తమ జిల్లా మీదుగా నీరు తీసుకెళ్లి ఖమ్మం జిల్లా రైతుల పొలాలకు నీటిని అందించడమేంటని జిల్లా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు ఉన్నా కూడా సాగు నీరు అందించాలనే బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పశువుల మేతగా మారిన పంటలు


ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో సాగర్ ఆయకట్టు కింద లక్ష ఎకరాల్లో వరి సాగు చేశారు. నాగార్జునసాగర్, మిర్యాలగూడ, కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలో ఇవి ఉండగా సుమారు 15వేల ఎకరాలకు పైగా వరి పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. కనీసం 15రోజుల పాటు సాగునీరు అందించి నట్లయితే పంటలు చేతికి వచ్చే పరిస్థితి ఉంది. ఎకరాకు రూ.30వేలు పెట్టుబడి పెట్టి రైతులు వరి సాగు చేశారు. పంటలు ఎండిపోతే తమ బతుకులు ఆగమవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగర్ ఆయకట్టు కింద సుమారు 4వేల ఎకరాలు ఎండిపోవడంతో రైతులు ఆశలు వదులుకొని జీవాలు, పశువులను మేపుతున్నారు.

### నీళ్లు వదిలితే పంట చేతికి వస్తుంది



ముల్కల కాల్వ మేజర్ కింద నాకున్న రెండెకరాల్లో వరి సాగు చేసిన. బోరు నీళ్లే ఇప్పుడు దీనికి ఆధారం. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పంట ఎండిపోయే పరిస్థితి వచ్చింది. వారం రోజుల నుంచి ఎడమ కాల్వ ద్వారా నీటిని ఖమ్మం జిల్లాకు తీసుకెళ్తున్నారు. మాకు కూడా నీళ్లు వదిలితే మా పొలాలు చేతికొస్తాయి. రూ.60వేల పెట్టుబడి పెట్టి పొలం సాగు చేసిన. ఈ పొలం ఎండిపోతే ఆర్థికంగా చితికిపోతాం. ప్రభుత్వం వెంటనే స్పందించి మేజర్లకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి.

*- దుండిగాల వెంకటయ్య, రైతు, యాద్గార్‌పల్లి, మిర్యాలగూడ*



మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు గ్రామంలో ఎండుతున్న వరి పొలం

## పట్టభద్రుల దరఖాస్తులు 4,63,876

- కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన
- ఏప్రిల్ 4న తుది జాబితా

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి8 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ-వరంగల్-ఖమ్మం నియోజకవర్గంలోని పట్టభద్రుల ఓటు నమోదు కోసం దరఖాస్తు గడువు ముగిసి పరిశీలన మొదలైంది. ఈ నెల 6వరకు దరఖాస్తుకు తుది గడువు ఉండగా మొత్తం 4,63,876 మంది అప్లై చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ దరఖాస్తులన్నింటినీ స్థానిక బీఎల్ఓలకు పరిశీలన కోసం అప్పగించారు. ఈ నెల 21వరకు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి ముసాయిదా ఓటర్ జాబితాను వెల్లడిస్తారు. ఈ జాబితాపై మార్చి 14 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. చివరగా అభ్యంతరాలను పరిష్కరించిన అనంతరం ఏప్రిల్ 4న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. తుది ఓటర్ల జాబితా రూపకల్పన అనంతరం ఏ క్షణమైనా ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల కావచ్చని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ నియోజకవర్గం 12 జిల్లాలు, 191 మండలాలతో విస్తరించి ఉంది. మొత్తం 4,63,876 మంది ఓటు హక్కు కోసం పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా ఖమ్మం జిల్లా నుంచి 83,652 దరఖాస్తులు రాగా అత్యల్పంగా సిద్దిపేట జిల్లా నుంచి 4,966 మంది ఓటు కోసం అప్లై చేసుకున్నారు. మిగతా జిల్లాలను పరిశీలిస్తే నల్లగొండలో 79,947, సూర్యాపేటలో 51,348, యాదాద్రిలో 36,187, జనగాంలో 23,530, మహబూబాబాద్‌లో 35,163, వరంగల్‌లో 43,425, హన్మకొండలో 41,608, జయశంకర్‌భూపాలపల్లిలో 13,230, ములుగులో 10,440, భద్రాద్రికొత్తగూడెంలో 40,380 దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటినీ పరిశీలించిన అనంతరం ముసాయిదా జాబితా ప్రకటన కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత ఎన్నికల్లో 5.05లక్షల మంది ఓటర్లుగా నమోదయ్యారు.